# చివరకు మిగిలేది

కుండపోతగా వర్షం కురిసి, ఆగిపోయింది—ఈదర గాలితో బాగా చలివేస్తోంది. ఆ వానకు, ఆ చలికి విసుక్కుని; ఆకలితో దేవుణ్ణి తిట్టుకుంది రాజి.

*　　　*　　　*

అది ఒక రైల్వేస్టేషన్– ఆస్టేషన్‌కు ఒక ప్రక్క గూడ్స్‌షెడ్ వుంది. ప్రతిరోజూ రాత్రివేళ ఆ షెడ్ నీడలో తన బ్రతుకుదెరువు వెదుక్కుంటూంది రాజి

ఆమధ్య ఆస్టేషన్ యార్డంతా వెలిగిపోయేటట్లు పెద్ద పెద్ద లైట్లు ఎత్తుగా బిగించటం తో, తన బ్రతుకుదెరువులో మట్టికొట్టినట్టు బాధపడింది ఆమె! ఇంతకు మునుపులా "ప్యాసింజర్స్"కోసం విచ్చలవిడిగా తిరిగేందుకు వీలులేక పోతూవుంది. అందులో ముందున్న రైల్వేపోలీస్ మంచి మహారాజు, ఏమీ అనేవాడు కాదు అతడు మారిపోయాడు. ఇప్పుడు క్రొత్తగావచ్చి నతడు కఠినాత్ముడు. ఎక్కడ కనిపిస్తే అక్కడ నిలువునా

డబ్బు గుంజుతున్నాడు. అయినా ఎలాగో అగూడ్సు షెడ్డు ధర్మమా— అనుకుంటూ తన వృత్తి సాగించుకుంటోంది రాజి.

*  *  *

ఆ రోజు ... సంధ్యలో తన బ్రతుకుదెరువుకు తయారయి వస్తే.... వచ్చినప్పటినుంచీ ఒకటే వర్షం, వదలని భూతంలా. ఒక్క ప్యాసింజరును కూడ తెచ్చుకోలేక పోయింది. అందుకే ఆ షెడ్డు పంచలో నిలుచుని, దేవుణ్ణి అలా తిట్టుకుంది, అవాళ రాజి.

బాగా చలి వేస్తోంది.

రెండు రోజులనుండి సరిగా తిండి లేదు. అవాళా అసలే ఏమీ తినలేదు. ముందుగా వెళ్ళి బిజినెస్ చేసి, కడుపునిండా ఏదన్నా తినాలని వచ్చింది రాజి వచ్చినప్పటినుండి ఒకటే వర్షం. చలితో, ఆకలితో పేగులు మెలిపెట్టుకు పోతున్నాయ్ నిండా గుడ్డన్నా లేదు....

వేడివేడిగా టీ అయినా త్రాగాలని వుంది. డబ్బుల్లేవు దానిక్కూడా. అసలు వ్యాపారం జరక్కపోయె! ఏ రోజుకు ఆరోజు, ఏ పూటకు ఆపూట అయింది ఆమె బ్రతుకు చివరకు?

"న్చ.... ఎవరయినా వచ్చి టీకి డబ్బులిచ్చినా వప్పేసుకోవాలి యివాళ ..." అనుకుంది రాజి అప్పటికి అలా అనుకోవటం అది నాలుగోసారి. అయినా ఎవరూ రాలేదు.

"లాభం లేదు. నేనే వెళ్ళి ప్యాసింజరును వెదుక్కుంటాను"— అనుకుంటూ బయలుదేరింది రాజి.

పార్సల్ ఆఫీస్ వెనుక ఓ మూల నిలుచుంది రాజి కనబడేటట్టు.... కాస్త వెలుగులోకి సర్దుకుంది. ఆ ప్రక్కే 'ఓవర్ బ్రిడ్జి...' ఒకరిద్దరు వచ్చే పొయ్యేవాళ్ళు కనిపిస్తారన్న ఆశ!.... సెకండు షో వదిలి కూడ చాలా సేపయి నట్లుంది.... శాల్తీలు అట్టేలేరు....

'ఆఁ .. యెవరో ప్యాసెంజర్ వస్తున్నట్లుంది. యెంతకయినా ఒప్పేసుకోవాలి బేరమాడకూడదు. టీ డబ్బులిస్తేచాలు....' రాజి ఆలోచిస్తూ మరి కాస్త ముందుకు వచ్చింది.

ఆ ప్యాసెంజర్ దగ్గరకు రాగానే నవ్వింది. నవ్వు బాగుండేమో.... అగాడు. ఆ 'మగాడు' ఆత్రంగా ఆకలిగా ఆమెను వళ్ళంతా కళ్ళతోనే చూశాడు. మరేం అనుకున్నాడో.... చకచకా వెళ్ళిపోయాడు తలవంచుకుని.

నిండా బంగారం నింపుకుని, తీరం చేరబోయి ... గభుక్కని సముద్రంలో తన ఓడ మునిగిపోయినట్లు కుమిలిపోయింది రాజి.

చలి మరీ విపరీతమయ్యింది

'అలాటి సమయంలోనే ప్యాసెంజర్లు వచ్చేది! అలాటి దివాళ.... అదేమిటో ఒక్కడయినా దొరకటంలేదు? వచ్చిన ఒక్క ప్యాసెంజరూ జారిపోయాడు. ఓహ్....అవును. ఈ మధ్య తను బాగా గమనిస్తోంది. తన నవ్వు చూచి ముందడుగేసిన మగాడు, తన శరీరం పరికించగానే వెనకడుగేస్తున్నాడు. ప్చ ... తను.... గతం.... కథ?.... హుఁ.... ఆకథ ఎవరికి కావాలి?? ఎవరు వింటారు? తను మనిషి కాదా??? న్చ .. ప్చ.... తనిప్పుడు చివరి దశలో వుంది. భగవాన్.... ముందు దారేది?? ముందు దారి అటు చు ... ఆ క్షణంలో కనీసం ఒక్క టీ అయినా త్రాగాలి???— దేశ దేశాలలో నాయకులకు వచ్చే అనేక జటిల సమస్యలకంటే, ఈ ఆకలి సమస్య అతి క్లిష్టమయింది రాజికి. రాజీ తీవ్రంగా ఆలోచించసాగింది—

సంక్షోభంలో చిక్కుకున్న అంతరిక్ష యాత్రికుడు సమయస్ఫూర్తితో రక్షించుకున్నట్లు.... రాజీకి ఆలోచనలో ఒక ఆశాకిరణం మెరిసింది! ఆ ఆశాకిరణం— రాగడు!!!

రాగడు అదే స్టేషన్‌లో చాలాకాలం నుండి అడుక్కుతింటూ జీవిస్తోన్న ఒక కుష్ఠురోగి చాలాసార్లు రాజివంక ఆశగా చూశాడు. రాజి దగ్గరకు అప్పుడు.... కిరాణా కొట్టు వాళ్ళ దగ్గర్నుంచి, కాలేజీ కుర్రాళ్ళ వరకూ వచ్చేవారు అత్యవసర పరిస్థితిలో కారుల్లో తీసికెళ్ళేవారు. అందుకే మహారాణిలా రాగణ్ణి నిర్లక్ష్యంగా చూసేది; హేళనగా మాట్లాడేది. వాడి కుళ్ళు శరీరం, కారుతున్న ఎర్రని రసి .. చూచి. అసహ్యించుకునేది. ఈరోజు ఆ రాగడు ఒక ప్యాసింజరు అయ్యాడు???—

మరి కాస్సేపు ఆ ఆలోచనలతోనే ఆగింది రాజి. కానీ, ఆకలి ఆగలేదు. ఎవ్వరూ అటు రాలేదు.

నిరాశగా నవ్వుకుంది రాజి. "ఇక లాభంలేదు. టీ అయినా త్రాగకపోతే.... ప్రాణాలు పోయేలా వున్నాయ్...." అనుకుంటూ ముందడుగు వేసింది.

* * *

రాగణ్ణి స్టేషన్ అంతా వెదికింది రాజి. చివరకు ఓవర్‌బ్రిడ్జి క్రింద ఓ మూల, మాంసపు ముద్దలా ముడుచుకుని పడుకుని ఉన్న రాగడు కనిపించాడు.

ఒలింపిక్స్‌లో బంగారుపతకం లభించిన క్రీడాకారిణిలా సంబరపడ్డది రాజి.

దగ్గరికి వెళ్ళి, మెల్లగా తట్టి లేపింది వాణ్ణి.

కళ్ళు నులుముకుంటూ, విసుక్కుంటూ లేచి, రాజిని చూచి ఆశ్చర్యపోయాడు వాడు.

"రా" అంటూ జవాబుకైనా ఎదురు చూడక క్లియో పాత్రలా ఆజ్ఞాపించి వెళ్ళిపోయింది రాజి.

అనూహ్యమైన సరిక్రొత్త సిద్ధాంతాన్ని కనుగొన్న సైంటిస్ట్‌లా ఎగిరి గంతేశాడు రాగడు.

గూడ్సు షెడ్ చీకట్లోకి వెళ్ళి నిల్చుంది రాజి. రాగడు దగ్గరికెళ్ళి "రూకలు లేవు, పావలే వుంది. అంతే!" అన్నాడు తడబడుతూ. "టికి వుంటే చాలు!" అన్నది రాజి.

* * *

బలిచక్రవర్తి కండలు కోసి ఇచ్చినట్లు ....ఆ పావలా రాజి ఒడిలో పడేసి, అనుకున్న ప్రకారం 'ఢాకా'ను పట్టుకున్న మానెక్ షాలా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు రాగడు– రాజి లేచి, చీర సర్దుకుని, టీ కొట్టువైపు బయలుదేరింది.

దూరాన అప్పుడే డ్యూటీకి వస్తున్న పోలీస్ కానిస్టేబుల్ చూశాడు ఆమెను.

ఆమె గమనించి ఆగింది. గ్రద్దను చూచిన కోడిపిల్లలా బెదిరి షెడ్డుకు వచ్చేసింది.

ఆ కానిస్టేబుల్ నేరుగావచ్చి పట్టుకున్నాడు రాజిని.

"దేశం నాశనమై పోతూ వుంది నీలాటి లంజల మూలాన. ఊఃః ... డబ్బులు తియ్" దబాయింపుగా బూతులు తిట్టి, దౌర్జన్యంగా ఒక దెబ్బ వేశాడు ఆమెమీద

రాజీకి అలవాటే అది, అయినా ఆవాళ టీకి మాత్రమే సంపాదించుకున్న ఆడబ్బు యిచ్చేందుకు ఇష్టపడలేదు.

అందుకే, "ఇవాళ ప్యాసెంజరు రాలేదు. డబ్బులేవు" అంది.

"ఆఁ.... అట్టాగేం??" అంటూ ఆమె రవికను చింపాడు లోపల చేయి పెట్టి, అంతా తడిమాడు డబ్బులు దొరకలేదు. చీర విప్పమన్నాడు.

"లంగా లేదు వద్దు" అన్నది రాజి దీనంగా.

కోపంతో ఆచీరను కూడ లాగి పారేశాడు నగ్నంగా నిలుచుంది రాజి నగ్నతమీద లేదు ఆమె దృష్టి.... ఆచీర కొంగున గట్టిగా కట్టివున్న పావలాను చూస్తాడేమోనని— దానిమీదే వుంది. గ్రద్ద ఆ పావలాను పసిగట్టింది.

నవ్వుతూ తీసుకున్నాడు వట్టి చీర ఆమె ముఖానకొట్టి, బయలుదేరాడు.

అంతలో రైల్వే పోలీస్ ఎదురయ్యాడు అతనికి.

"ఇది స్టేషన్ యార్డ్. ఇక్కడ డ్యూటీ నాది. ఆడబ్బులు నావి. ఇలాతే" అంటూ ఎదురు తిరిగాడు ఆటవున్ పోలీస్‌మీద.

"బాయ్! మనలో మనకు పేచీ ఎందుకు?? పావలేగా??! ఫిఫ్టీ ఫిఫ్టీ, ఇద్దరం త్రాగుదాం, పద!!'– అంటూ దోస్తు కలిపాడు టవున్ పోలీస్.

వారిదరూ టీ త్రాగను వెళ్ళిపోయారు.

చీర కట్టుకోవటం కూడ మరచి, అలాగే నిలుచుండి పోయింది రాజి—

వర్షం మళ్ళీ ప్రారంభమయింది.

★